క్లుప్తంగా

ఉద్యోగ భద్రత కల్పించాలి

ఇచ్ఛాపురం టౌన్: తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని మున్సిపల్ కార్మికులు కోరుతున్నారు. ఈ మేరకు ప్రభుత్వం మున్సిపల్ కార్మికులను ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించే చర్యలపై ఆస్పత్రి రోడ్డులో గురువారం నిరసన తెలిపారు. కాంట్రాక్ట్ ఉద్యోగులు, పారిశుద్ధ్య ఇంజినీరింగ్ కార్మికులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. విశ్రాంత కార్మికుల పిల్లలకు ఉద్యోగాలు కల్పించాలన్నారు. 12వ పీఆర్సీ కమిటీ నియమించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పిస్తూ గ్రాడ్యూటీ చెల్లించాలని విన్నవించారు. కార్యక్రమంలో కార్మిక సంక్షేమ సంఘ జిల్లా అధ్యక్షుడు రమేష్ పట్నాయక్, లక్ష్మణ్, లిమ్మాయి తదితరులు పాల్గొన్నారు.

వన్ స్టాప్ సెంటర్ పోస్టర్ ఆవిష్కరణ


వన్‌స్టాప్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

కాశీబుగ్గ: ఆపదలో ఉన్న మహిళలకు అండగా ఉండేందుకు రాష్ట్ర ప్రభుత్వం నూతన విధానం ప్రవేశపెట్టింది. గృహ హింస, అత్యాచారాలు, యాసిడ్ దాడులు, బాలికలపై లైంగిక వేధింపులు, బాల్య వివాహాలు, మహిళలు, బాలికల కిడ్నాప్, సైబర్ నేరాలు వంటి బాధిత మహిళలకు చేయూత అందించేందుకు వన్ స్టాప్ సెంటర్‌ను నూతనంగా తీసుకొచ్చారు. ఈ వన్ స్టాప్ సెంటర్ పోస్టర్‌ను గురువారం పురపాలక సంఘం కార్యాలయంలో కమిషనర్ నడిపేన రామారావు ఆవిష్కరించారు. వన్ స్టాప్ సెంటర్‌లో బాధిత మహిళలకు వైద్య సాయం అందించడం, కౌన్సిలింగ్ నిర్వహించడం, తాత్కాలిక ఆశ్రమం, న్యాయ సహాయం కల్పించడం జరుగుతుందన్నారు. ఎవరైనా టోల్ ఫ్రీ నంబర్ 181కు కాల్ చేసి సాయం పొందవచ్చని తెలియజేశారు.

శిక్షణ తరగతులు సద్వినియోగం చేసుకోవాలి


శిక్షణ తరగతుల్లో పాల్గొన్న చిన్నారులు

సోంపేట: పట్టణంలోని తిరుమల థియేటర్ ఆవరణలో స్థానిక ధ్యాన్‌చంద్ స్పీడ్ స్కాటర్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ తరగతులు సద్వినియోగం చేసుకోవాలని క్లబ్ ప్రతినిధులు సూచించారు. ఈ మేరకు శిక్షణ తరగతులు గురువారం ప్రారంభించారు. విద్యార్థులకు స్కేటింగ్, యోగా, వ్యాయామంపై శిక్షణ ఇస్తున్నట్లు కోచ్ గోపాల్ తెలియజేశారు. సుమారు 25 మంది విద్యార్థులు శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆసక్తి ఉన్నవారు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సారా తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

ఇచ్ఛాపురం టౌన్: ఒడిశా నుంచి ఆంధ్రాకు 12 సారా బస్తాలు తరలిస్తున్న ఒడిశాకు చెందిన జినక దాసును అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ సీఐ పి.దుర్గాప్రసాద్ తెలిపారు. బుధవారం రాత్రి తనిఖీలు చేస్తూ నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించారు. పాత కేసుల్లో మరో ఐదుగురిని తహసీల్దార్ వద్ద బైండోవర్ చేసినట్లు పేర్కొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

కవిటి: మండలంలోని బొరివంక ఉప విద్యుత్ కేంద్రం పరిధిలోని మాణిక్యపురం ఫీడర్‌లో 11కేవీ పనులు, ఆర్‌డబ్ల్యూఎస్‌లో ఆర్‌డీఎస్‌ఎస్ పనులు జరుగుతున్న నేపథ్యంలో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అదేవిధంగా బొరివంక ఫీడర్‌లో పనుల నిమిత్తం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సరఫరా ఉండదన్నారు. ఈ కారణంగా ఆయా ఫీడర్ల పరిధిలోని మాణిక్యపురం, బల్లిపుట్టుగ, కుసుంపురం, వరక, లొళ్లపుట్టుగ, గొనపపుట్టుగ గ్రామాల్లో అంతరాయం ఉంటుందని వెల్లడించారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

ఎస్సీ వర్గీకరణతో అన్యాయం


వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

కవిటి: రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణతో ఒడియా మైనార్టీలకు అన్యాయం జరుగుతుందని ఆ సంఘం నాయకులు అన్నారు. ఈ మేరకు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఉత్తరాంధ్ర ఒడియా మైనార్టీ అసోసియేషన్ అధ్యక్షుడు సత్యనారాయణ పాడికి వినతిపత్రం గురువారం అందజేశారు. కార్యక్రమంలో ఒడియా మైనార్టీ ఎస్సీ కుల అధ్యక్షుడు ఎస్.రవికుమార్, ప్రధాన కార్యదర్శి మురళీ నాయక్, లావణ్య పాట్టిక తదితరులు పాల్గొన్నారు.

టమాటా రైతు దిగాలు..!


టమాటా బాక్స్‌లు


టమాటాలు ఏరుతున్న రైతులు

- తెగుళ్లు సోకడంతో పడిపోయిన దిగుబడి
- ధర సైతం తగ్గడంతో నష్టాలు
- ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకోలు

సోంపేట: రబీ సీజన్‌లో టమాటా పంట సాగు చేసిన రైతులకు నష్టాలు తప్పేలా లేవు. సోంపేట, కంచిలి మండలాల పరిధిలోని బారువ, బెంకిలి, జింకిభద్ర, పలాసపురం, లక్కవరం, మండపల్లి, కుత్తుమ, అమ్మవారిపుట్టుగ తదితర గ్రామాల్లో సుమారు 1000 ఎకరాల్లో రబీ సీజన్‌లో టమాటా పంటను సాగు చేశారు. మొక్కలు నాటిన దగ్గర నుంచి వాటి సస్యరక్షణ చర్యలకు అధికంగా ఖర్చులు చేశారు. డిసెంబర్ నెలలో కురిసిన వర్షాలకు రబీ సీజన్‌లో టమాటా సాగు చేయడం నెల రోజులు ఆలస్యం అయ్యింది. సాగు ఆలస్యం కావడం, ప్రకృతి సహకరించకపోవడంతో టమాటా పంటకు పురుగు, తెగుళ్లు సోకాయి. దీంతో ప్రస్తుతం పంట దిగుబడిలేదు. వచ్చిన కాస్త పంట కిలో రూ.3 లు మాత్రమే పలుకుతుండడంతో ధర లేదు. రైతు శ్రమ దేవుడెరుగు, కనీసం పెట్టుబడులు వచ్చే పరిస్థితి లేదని రైతులు వాపోతున్నారు.

వ్యాపించిన తెగుళ్లు

పంటలకు తీవ్రంగా తెగుళ్లు వ్యాపించడంతో రైతులు పంటను కాపాడుకోవడానికి అధికంగా పెట్టుబడులు పెట్టారు. ఎకరానికి సుమారు రూ.50 వేలకు పైగా పెట్టుబడి పెట్టినా ప్రయోజనం లేకుండా పోయింది. ప్రస్తుతం 27 కిలోల బాక్స్ రూ.80లు పలుకుతోంది. గతంలో ఎకరానికి 20 టన్నుల దిగుబడికి పైగా వచ్చేది. ప్రస్తుతం రెండు టన్నుల దిగుబడి కూడా లేదని రైతులు వాపోతున్నారు. దీనికి తోడు ధరలు భారీగా పడిపోవడంతో కనీసం పెట్టుబడిలో సగమైనా వస్తుందనే నమ్మకం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. టమాటా పండ్లు ఏరేందుకు వచ్చే కూలీలకు ఇచ్చేందుకు కూడా ధర సరిపోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఈ నెలలో బాక్స్ ధర రూ.300లకు పైగా పలికేదని గుర్తు చేసుకుంటున్నారు. ప్రభుత్వం స్పందించి రైతులకు మద్దతు ధర కల్పించాలని కోరుతున్నారు.

మూడు ఎకరాల్లో సాగు



మూడు ఎకరాల్లో టమాటా పంట సాగు చేశాను. పంటకు ఆకు ముడత తెగుళ్లు రావడంతో వ్యవసాయ శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు సూచించిన మందులు పిచికారీ చేశాను. మూడు ఎకరాలకు సుమారు రూ.2 లక్షల వరకు పెట్టుబడి పెట్టాను. కానీ మూడు ఎకరాలకు కనీసం 200 బాక్సుల పంట దిగుబడి కూడా రాలేదు. దీంతో తీవ్రంగా నష్టపోయాను. 15 సంవత్సరాలుగా టమాటా సాగు చేస్తున్నాను. కానీ ఇలాంటి పరిస్థితి ఎన్నడూ చూడలేదు. ప్రభుత్వమే మమ్మల్ని ఆదుకోవాలి

– పోకల హేమరాజు, జింకిభద్ర, సోంపేట

పెట్టుబడి వచ్చే పరిస్థితి లేదు



ఈ రబీ సీజన్‌లో సుమారు ఎకరా యాభై సెంట్ల భూమిలో టమాటా సాగు చేశాను. రబీ సీజన్‌లో వరి పంట పూర్తిగా పాడైపోయింది. దీంతో టమాటా పంటపై ఆశలు పెట్టుకున్నాం. అయితే చీడపీడలు వలన ఈ పంట కూడా పూర్తిగా పాడైపోయింది. కనీసం ధర ఉంటే పెట్టుబడిలో పావలా వంతు అయినా వచ్చేది. ధర భారీగా పడిపోవడంతో తీవ్రంగా నష్టపోయాం. ఇలాంటి పరిస్థితి ఎప్పుడూ రాలేదు.

– సాహుకారి దినేష్, బెంకిలి, సోంపేట

చిన్న పరిశ్రమలతో ప్రజలకు ఉపాధి


పారిశ్రామిక పార్కుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే శిరీష

పలాస: చిన్న పరిశ్రమలతో ప్రజలకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించాలని, దీనికి ఎంఎస్ఎంఈ పార్కు ఉపయోగపడాలని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. మండలంలోని రామకృష్ణాపురం గ్రామం వద్ద గతంలో ప్రభుత్వం సేకరించిన 60.84 ఎకరాల భూమిలో గురువారం పారిశ్రామిక పార్కు ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మొత్తం భూమిలో 76 ప్లాట్లను ఏర్పాటు చేయడమైందన్నారు. ఈ ప్రాజెక్టు అభివృద్ధి కోసం రూ.12.50 కోట్ల నిధులను ప్రభుత్వం మంజూరు చేసిందని తెలిపారు. రూ.96 కోట్ల ప్రతిపాదిత పెట్టుబడితో 76 యూనిట్లు స్థాపించవచ్చని పేర్కొన్నారు. ఇవి అభివృద్ధి చెందితే ప్రత్యక్షంగా 1500 మందికి, పరోక్షంగా మరో 500 మందికి ఉపాధి లభిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో పలాస–కాశీబుగ్గ జీడి వ్యాపార సంఘాల నేతలు మల్లా రామేశ్వరరావు, మల్లా శ్రీను, పీరుకట్ల విఠల్, లోడగల కామేశ్వరరావు, శాసనపురి మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కక్ష సాధింపు చర్యలు ఆపాలి


టెక్కలి ఆర్డీఓ కార్యాలయం ఎదురుగా నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న జర్నలిస్టులు

టెక్కలి: పత్రిక స్వేచ్ఛకు సంకెళ్లు వేసే విధంగా సాక్షి ఎడిటర్ ధనుంజయరెడ్డిపై చేస్తున్న కక్ష సాధింపు చర్యలు ఆపాలని పలువురు జర్నలిస్టులు నినాదాలు చేశారు. సాక్షి ఎడిటర్ ధనుంజయరెడ్డి నివాసంలో అక్రమంగా సోదాలు చేయడాన్ని నిరసిస్తూ గురువారం టెక్కలిలో పలువురు జర్నలిస్టులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమం చేపట్టారు. టెక్కలి ఆర్డీఓ కార్యాలయం ఎదురుగా నినాదాలు చేసి అనంతరం కార్యాలయం ఎల్ఆర్ డిప్యూటీ తహసీల్దార్ వి.ప్రవీణ్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు కె.సుదర్శన్‌రావు, ఉపాధ్యక్షుడు ఎస్.గోపినాథ్, జర్నలిస్టులు ఎస్.రాజశేఖర్, ఎల్‌వీ రమణ, డి.గౌరీశంకర్‌రెడ్డి, పి.పాపారావు, డి.రంగబాబు, డి.భానుప్రసాద్, ఎస్.బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

యూనియన్ డైరెక్టర్‌గా కృష్ణారావు

కాశీబుగ్గ: జిల్లా గొర్రెలు, బ్రీడర్స్ కో–ఆపరేటివ్ యూనియన్ లిమిటెడ్ మేనేజ్ కమిటీ ఎన్నికలు గురువారం జిల్లా కేంద్రంలో జరిగాయి. దీనిలో భాగంగా పలాస మండలం చిన్నగురుదాసుపురం పంచాయతీ గొర్రెల సంఘం అధ్యక్షుడు పానిల కృష్ణారావును జిల్లా బోర్డు డైరెక్టర్‌గా ఎన్నుకున్నారు. కార్యవర్గ ఎన్నికతో పాటు తొమ్మిది మంది డైరెక్టర్లలో ఈయనకు అవకాశం దక్కడంపై పలాస పరిసర ప్రాంత గొర్రెల సంఘ నాయకులు, గొర్రెల కాపరులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ముక్కు మూసుకోవాల్సిందే..!


పేరుకుపోయిన చెత్త

టెక్కలి: టెక్కలి మేజర్ పంచాయతీలో రోజురోజుకూ పారిశుద్ధ్యం అధ్వానంగా మారుతోంది. స్థానిక మెయిన్ రోడ్డులోని లక్ష్మీ నృసింహ స్వామి ఆలయానికి ఎదురుగా మురుగు కాలువ చెత్త నిల్వలతో పేరుకుపోయి దుర్గంధాన్ని వెదజల్లుతోంది. దీంతో ఆ మార్గంలో రాకపోకలు సాగించేవారంతా ముక్కు మూసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా పంచాయతీ యంత్రాంగం స్పందించి కాలువను శుభ్రం చేయాలని స్థానికులు కోరుతున్నారు.

చినుకుపడితే చిత్తడే

- అధ్వానంగా రహదారులు
- ప్రజలకు తప్పని ఇబ్బందులు


ఇటీవల కురిసిన వర్షాలకు టెక్కలి అంబేడ్కర్ జంక్షన్‌లో చెరువుగా మారిన రోడ్డు

టెక్కలి: డివిజన్ కేంద్రమైన టెక్కలిలో పలు ప్రధాన రహదారులు చినుకుపడితే చిత్తడిగా మారుతున్నాయి. ఎక్కడికక్కడ వర్షపు నీరు నిలిచిపోయి చెరువులను తలపిస్తున్నాయి. టెక్కలి అంబేడ్కర్ జంక్షన్‌తో పాటు టెక్కలి–చెట్లతాండ్ర రోడ్డులోని పాత్రుని కోనేరు వద్ద ప్రధాన రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. పట్టణానికి ప్రధాన జంక్షన్‌గా ఉన్నటువంటి అంబేడ్కర్ జంక్షన్‌లో రోడ్డు పరిస్థితి మరీ దయనీయంగా మారింది. చెరువును తలపించే విధంగా మురుగు నీరు నిల్వగా చేరుతోంది. వర్షపు నీటితో పాటు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి మురుగు నీరంతా చేరుతోంది. పాత్రుని కోనేరు ఎదురుగా ఇటీవల కల్వర్టు నిర్మాణం చేపట్టినప్పనుంచి అక్కడ సమస్య తీవ్రత పెరిగింది. దీంతో ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తున్న స్థానికులు అనేక అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.


పాత్రుని కోనేరు ఎదురుగా చిత్తడిగా మారిన రోడ్డు

అధ్వానంగా ఉంది



వర్షం పడితే అంబేద్కర్ జంక్షన్‌లో రోడ్డు అధ్వానంగా మారుతోంది. ఇటీవల కురిసిన చిన్నపాటి వర్షానికే బురదతో చెరువుగా మారింది. దీంతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ సమస్యను పరిష్కరించేవిధంగా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– హెచ్.లక్ష్మణరావు, టెక్కలి.

బురదమయం



టెక్కలి–చెట్లతాండ్ర రోడ్డులో గతంలో ముంపు సమస్య ఉండేది. గత ప్రభుత్వంలో సీసీ రోడ్డు వేసి సమస్యను పరిష్కరించారు. ఇప్పుడు కల్వర్టు నిర్మాణం చేసి మరలా సమస్యను పెద్దది చేశారు. దీంతో ఈ ప్రాంతం బురదమయంగా మారింది. తక్షణమే బురద సమస్యను పరిష్కరించాలి.

–యు.తమ్మయ్య, విశ్రాంత ఉద్యోగి, టెక్కలి.

జయహో.. భారత్


కంచిలి: భారత సైన్యానికి మద్దతుగా ర్యాలీ చేస్తున్న ఎమ్మెల్సీ నర్తు రామారావు తదితరులు

ఆపరేషన్ సింధూర్ పేరుతో పాకిస్తాన్‌లో ఉగ్రమూకలపై భారత సైన్యం చేసిన ప్రతిదాడి అభినందనీయమని వక్తలు పేర్కొన్నారు. ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా మట్టుబెట్టాల్సిన అవసరం ఉందన్నారు. ప్రపంచ దేశాలు ఉగ్రవాదంపై ఉక్కుపాదం మోపాలని పిలుపునిచ్చారు. ఆపరేషన్ సింధూరుకు మద్దతుగా జయహో.. భారత్ అంటూ గురువారం ర్యాలీ చేపట్టారు.

– సాక్షి నెట్‌వర్క్


కంచిలి: రైల్వేస్టేషన్ కూడలిలో మానవహారం


టెక్కలి: భారత సైన్యానికి మద్దతుగా ర్యాలీ


కాశీబుగ్గ: పలాసలో ర్యాలీ...

పరామర్శ


అప్పలనాయుడు తల్లిని పరామర్శిస్తున్న తిలక్ తదితరులు

టెక్కలి: మండలంలోని శ్యామసుందరాపురం గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు పొట్నూరు అప్పలనాయుడు తల్లి ఇటీవల అనారోగ్యానికి గురైంది. దీంతో వారి కుటుంబాన్ని వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ గురువారం పరామర్శించారు. అలాగే ఇదే గ్రామంలో మరో యువకుడు రోడ్డు ప్రమాదానికి గురవ్వడంతో ఆ యువకుడిని పరామర్శించి, ఆరోగ్యం గురించి తెలుసుకున్నారు. ఆయనతో పాటు సర్పంచ్ పొట్నూరు భూలక్ష్మి, నాయకులు సత్తారు సత్యం, ఆట్ల రాహుల్, కె.జీవన్, పి.వైకుంఠరావు, ఎస్.ఉగాదిరావు తదితరులు ఉన్నారు.

రైల్వే గేటును ఢీకొన్న ఆటో


గేటుకు మరమ్మతులు చేస్తున్న అధికారులు

కాశీబుగ్గ: కాశీబుగ్గ ఎల్‌సీ రైల్వే గేటును గురువారం మధ్యాహ్నం లగేజీ ఆటో ఢీకొట్టింది. రైల్వే అధికారులు వచ్చేలోపే డ్రైవర్ పరారయ్యాడు. రైల్వే అధికారులు వెంటనే మరమ్మతులు చేపట్టారు. ఈ సమయంలో మండుటెండలో ఇరువైపులా వాహనాలు బారులు తీరగా ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులుపడ్డారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని రైల్వే గేటుకు ఇరువైపులా ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

నేత్రపర్వంగా శ్రీనివాస కల్యాణం


కవిటి: ప్రగడపుట్టుగలో సీతారాముల కల్యాణోత్సవం


టెక్కలి: పద్మావతి శ్రీనివాస కల్యాణం నిర్వహిస్తున్న పండితులు

టెక్కలి: వైశాఖ శుద్ధ ఏకాదశి పర్వదినం పురస్కరించుకొని స్థానిక పట్టుమహాదేవి కోనేరు గట్టుపై ఉన్న వైభవ వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో గురువారం పద్మావతి శ్రీనివాస కల్యాణం నేత్రపర్వంగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛరణలతో నిర్వహించిన ఈ కల్యాణంలో పలువురు దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ఈనెల 12న లక్ష్మీనారాయణ కల్యాణం

వజ్రపుకొత్తూరు రూరల్: మండలంలోని నగరంపల్లిలో ఈనెల 12వ తేదీన లక్ష్మీనారాయణ స్వామి వసంత కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నట్లు ఉత్సవ నిర్వహణ కమిటీ సభ్యులు గురువారం తెలిపారు. దీనిలో భాగంగా ప్రత్యేక పూజలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.

కమనీయం రాములోరి కల్యాణోత్సవం

కవిటి: మండలంలోని ప్రగడపుట్టుగ కోదండ రామాలయం, కవిటిలో వెలసిన పట్టాభి రామాలయాల్లో గురువారం నుంచి వైశాఖ మాసం సందర్భంగా నిర్వహిస్తున్న తిరుక్కల్యాణ మహోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. బ్రహ్మపురానికి చెందిన వేదపండితుల ఆధ్వర్యంలో పాంచరాత్ర ఆగమ సాంప్రదాయంలో ఈ వేడుకలను నిర్వహిస్తున్నారు. తొలిరోజు వేకువజామున సుప్రభాత సేవ, నిత్యదర్శనాలతో భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం కల్యాణోత్సవాలు ప్రారంభమయ్యాయి. సాయంత్రం సీతారాముల కల్యాణాన్ని వైభవోపేతంగా నిర్వహించారు. కవిటి పట్టాభి రామాలయంలో బి.కామరాజు దంపతులు, ప్రగడపుట్టుగలో బల్లెడ ఎర్రప్ప విజయలక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో కల్యాణోత్సవం నిర్వహించారు.